క్లుప్తంగా

బస్టాండులో ఖాళీ షాపులకు టెండర్లు

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ బస్టాండులోని ఖాళీగా ఉన్న షాపులకు టెండర్లు పిలవనున్నట్లు డిపో మేనేజరు జి.రమణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు టెండర్లలో పాల్గొనవచ్చన్నారు. టెండర్ల ఫారాలు 3 నుంచి 16 వరకు డిపో మేనేజరు కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. పూర్తి చేసిన టెండర్ ఫారాలు 17న మధ్యాహ్నం 2గంటలకు లోపు రాయచోటి జిల్లా ప్రజారవాణా అధికారి కార్యాలయంలో టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు. అదే సాయంత్రం టెండర్లు తెరవనున్నట్లు చెప్పారు.

పాలేటమ్మ తిరునాల నేడు


పాలేటమ్మ మూలవిరాట్

చిన్నమండెం : మండలంలోని కేశాపురం బంగ్లా వద్ద కొలువైన పాలేటమ్మ తిరునాల గురువారం రాత్రి నుంచి అత్యంత వైభవంగా ప్రారంభం కానుంది. శుక్రవారం సాయంత్రం వరకు జరిగే ఈ తిరునాల కోసం జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల కోసం ఆలయాన్ని ముస్తాబు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. ఆలయ ప్రాంతమంతా విద్యుత్ దీపాలతో అలంకరించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. తిరునాల సజావుగా సాగేందుకు వీలుగా బందోబస్తు ఏర్పాట్లలో పోలీసులు నిమగ్నమయ్యారు. జాతరకు కడప, చిత్తూరు జిల్లాల నుంచి తరలివచ్చే వేలాది మంది భక్తులతో ఈ ప్రాంతం జనసంద్రాన్ని తలపిస్తుంది. మూడు రోజుల ముందు నుంచే భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పిస్తుంటారు. నడిగడ్డపల్లె ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో సిద్ధల బోనాలు తీసుకురావడం ఆనవాయితీ. కీలుగుర్రాలు, కోలాటాలు, చెక్కభజనలు, బాణసంచా ప్రత్యేక ఆకర్షణ.

హరిహర తనయుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప

రాజంపేట రూరల్ : హరిహరసుతుడు, శబరగిరీసుడైన అయ్యప్పస్వామికి ఉత్తరా నక్షత్ర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణ శివార్లలోని జాతీయరహదారిపై మణికంఠ నగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఉత్తరా నక్షత్రమును పురస్కరించుకొని ధర్మకర్త పాల ప్రకాష్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ముందుగా అయ్యప్పస్వామికి గురుస్వామి సత్య శాస్త్రోక్తకంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని అలంకరించి పల్లకీ సేవ నిర్వహించారు.

డ్రోన్ సహాయంతో భూముల రీ సర్వే


డ్రోన్ ద్వారా సర్వే చేస్తున్న దృశ్యం

పెనగలూరు : మండలంలో మొదటిసారిగా డ్రోన్ ద్వారా భూములు రీ సర్వే చేస్తున్నట్లు మండల సర్వేయర్ ఓబయ్య తెలిపారు. ఈటమాపురం పంచాయతీలోని సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓలు ద్వారా ఈ డ్రోన్‌తో భూములు సర్వే చేశారు. మొదటిరోజు 2 వేల ఎకరాలకుపైగా భూసర్వే చేసినట్లు ఆయన తెలిపారు. డ్రోన్ ద్వారా సర్వే చేయడం ఎంతో సులభతరంగా ఉందని, మండల వ్యాప్తంగా అన్ని భూములను సర్వే చేయడం జరుగుతుందన్నారు. మొదటగా ఈటమాపురం వద్ద డ్రోన్‌తో సర్వేను ప్రారంభించారు. డ్రోన్‌తో సర్వే చేసి ప్రభుత్వానికి నివేదికలు అందించనున్నట్లు వారు తెలిపారు.

శిక్షణా కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్ రెడ్డి

గాలివీడు : మండలంలో పలు గ్రామాలలో ఉన్న యువతీయువకుల నైపుణ్యం కోసం రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సూచనలు మేరకు సోలార్ (సీఎస్ఆర్) కార్యక్రమాలలో భాగంగా మండల కేంద్రంలోని కుట్టుమిషన్లు, కంప్యూటర్ శిక్షణలు యువతీయువకులకు నైపుణ్యం కోసం ఏర్పాటు చేశామని గాలివీడు ఎంపీపీ జిల్లా సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఆయన వెలుగు ఏపీఎం రెడ్డయ్యతో కలిసి బుధవారం కుట్టు మిషన్ సెంటర్లు, కంప్యూటర్ శిక్షణా కేంద్రాలను సందర్శించి మండలంలోని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

మహిళల సాధికారత కోసమే సంక్షేమం


సంబేపల్లె: మహిళలను సన్మానించిన నాయకులు


రైల్వేకోడూరు: చీరలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల


రాజంపేట: ర్యాలీ తీస్తున్న మహిళలు

రైల్వేకోడూరు : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, మహిళలకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వీలైనంత ఎక్కువగా మహిళల పేరిట అందిస్తున్నారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళల అభ్యున్నతికి కృషిచేస్తుందన్నారు. మహిళలకు నామినేటెడ్ పోస్టుల్లో, కాంట్రాక్టు పనుల్లో సగభాగం కేటాయిస్తున్నారన్నారు. మహిళల రక్షణకోసం దిశా చట్టాన్ని రూపొందించి సత్వరమే న్యాయం జరిగేలా దిశా పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీ టూరిజం డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, సుధాకర్‌రాజు, మండల నాగేంద్ర, పుష్పలత, నాగమణి, అరుణమ్మ, శారదమ్మ, సావిత్రమ్మ, రంగమ్మ, మహిళలు పాల్గొన్నారు.

స్త్రీ,శిశు సంక్షేమ శాఖ పీడీ ధనలక్ష్మి ఆధ్వర్యంలో..

రాయచోటి అర్బన్ : మహిళలు అన్ని రంగాలలో రాణించి ఆర్థికాభివృద్ధిని సాధించాలని స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ ధనలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో స్త్రీశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీలు అన్నిరంగాలలో మరింతగా రాణించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ప్రభుత్వం మహిళల విద్యాభివృద్ధికి ఎంతో చేయూతనిస్తోందని, విద్యార్థినులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం పోలీసు, సచివాలయం, ఐసీడీఎస్‌తో పాటు స్వచ్ఛంద సంస్థలలో ప్రతిభ చూపిన మహిళా ఉద్యోగులను ఆమె సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రాయచోటి అర్బన్ : సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమైనదని అన్నమయ్యజిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్ అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేస్తూ ఆర్టీసీని అభివృద్ధి బాటలోకి తీసుకురావడంలో ఉద్యోగినుల పాత్ర ఎంతో విలువైందన్నారు. అనంతరం స్థానిక గైనకాలజిస్టు హరిణి, చైతన్య మహిళా సంఘం జిల్లానాయకురాలు ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర కీలకమన్నారు. అనంతరం జిల్లా పరిధిలోని రాయచోటి డిపోకు చెందిన హనీఫా, మదనపల్లె- 1,2 డిపోలకు చెందిన హేమావతి, గిరిజమ్మ, పీలేరు, రాజంపేట డిపోలకు చెందిన లక్ష్మీదేవి, మస్తానమ్మలను వారు సత్కరించి, రివార్డును అందజేశారు.

మహిళలను ప్రోత్సహించినప్పుడే సమాజ పురోగతి

మహిళలను అన్నిరంగాల్లో ప్రోత్సహించినప్పుడే సమాజ పురోగతి సాధ్యమని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా కార్యదర్శి డి.గంగాదేవి అన్నారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలు బస్టాండు నుంచి ఠాణా వరకు ర్యాలీని నిర్వహించారు. అనంతరం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను చేశారు. యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి జాబీర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, డి.సి. వెంకటయ్య, ఖాజాబీ, బంగారుపాప, ముంతాజ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామంలోని హ్యాపీకిడ్స్ హైస్కూల్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా కొత్తమాధవరం ఎస్‌బీఐ మేనేజర్ జ్యోతిర్మయి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట సీఐ మాట్లాడుతూ స్త్రీల గొప్పతనాన్ని తెలియజేశారు. అనంతరం కొత్తమాధవరం ఎస్‌బీఐ మేనేజర్ జ్యోతిర్మయిని పాఠశాల కరస్పాండెంటు అనీల్‌కుమార్‌రెడ్డి, సీఐ పురుషోత్తంరాజు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. పాఠశాల హెడ్‌మాస్టర్ శ్రీరాములు, ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : ప్రపంచ మహిళా దినోత్సవాన్ని బుధవారం మండలంలోని పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. మంగంపేట ఏపీఎండీసీ కార్యాలయంలో ఆద్యా మెడికల్స్ సర్వీసెస్ అధ్వర్యంలో కేక్ కట్ చేశారు. నిర్వాహకులు సి.అశోక్ మాట్లాడుతూ వైద్య రంగంలో మహిళలు అన్ని విధాలా సేవలందిస్తున్నారని వారికి శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎం ఆర్ ముగం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని కొనియాడారు. మహిళలు అభివృద్ధి చేందెందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కృష్ణమూర్తి, వైద్యులు రామంజినేయులు, వైద్యసిబ్బంది దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలే సమాజానికి దిక్సూచి

సంబేపల్లె : మహిళలే సమాజానికి దిక్సూచి అని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గుట్టపల్లె పంచాయతీలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబర్‌రెడ్డి నివాసంలో పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, మాజీ సర్పంచ్ పాలవెంకటరమణ, నాయకులు బ్రహ్మానందరెడ్డి, మల్లికార్జునరెడ్డి, లక్ష్మీకర్‌రెడ్డి, శివారెడ్డి, రమణారెడ్డి, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సహనం భూదేవితో సమానం

రాజంపేట రూరల్ : భూదేవితో సమానంగా నేటి మహిళలకు సహనం ఉందని రాజు హైస్కూల్ సీఈఓ వి.మోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ జి.రఘురామరాజు కొనియాడారు. స్థానిక రాజు హైస్కూల్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయనీలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ప్రతిభ చూపి ముందడుగు వేస్తున్నారని చెప్పారు. మహిళలే మానవ జాతి మనుగడకు మూలధారమని కొనియాడారు. వేడుకలలో ఉపాధ్యాయులు శివజ్యోతి, వాణి, గాయత్రి, ప్రీతి, నీలవేణి, ప్రసన్న, ఫర్హానా, శిరీషా, సునీత, రతీ, రాజేశ్వరి, సుప్రియ, సోని తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లిలో..

లక్కిరెడ్డిపల్లి : శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆధ్వర్యంలో దేవలంపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీజ, ఏరియా మేనేజర్ లక్ష్మిరెడ్డిలు పాల్గొని మహిళల ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి వివరించారు. హాజరైన మహిళలు చేత కేక్ కట్ చేయించారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో డ్వాక్రా సభ్యురాళ్లతో కలిసి ఏపీఎం నిరంజన్, జెడ్పీ ఎస్ఎఫ్ కాంతమ్మల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పీబీబీ అధికారిణి యాస్మీన్, సూపర్‌వైజర్ ఆంజనేయులు, రమేష్, శివ, మహిళా పాడి రైతులు పాల్గొన్నారు.

వీరబల్లిలో..

వీరబల్లి : మహిళలు అన్ని రంగాలలో రాణించాలని ఏపీఎం ఖాదర్ వలీ తెలిపారు. బుధవారం మండల మహిళా సమాఖ్యలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాలలో ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తోందని తెలిపారు. తీసుకున్న రుణాలు ద్వారా మంచి జీవనోపాధులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల సమాఖ్యలో ఆటలు పోటీలు నిర్వహించి విజేతలను సత్కరించారు. మండలంలోని ముగ్గురు ఉత్తమ వీఓఏలు, గ్రామ సమాఖ్యల వారికి ఉత్తమ సేవా సర్టిఫికెట్‌లు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య సిబ్బంది, స్త్రీనిధి మేనేజర్ సుధీర్, వీఓఏలు, సమాఖ్య కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి: జడ్జి సరస్వతి

రాజంపేట టౌన్ : విద్యార్థినులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని రాజంపేట సీనియర్ సివిల్ జడ్జి ఎన్.సరస్వతి తెలిపారు. స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి విద్యార్థినులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థి దశలో విద్యార్థులు కేవలం చదువుపైనే దృష్టిసారించాలని తెలిపారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదన్నారు. అందువల్ల సమయాన్ని ఏమాత్రం వృథా చేయకుండా కష్టపడి చదవి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆమె ఆకాంక్షించారు. విద్యార్థినీలకు ఏదైనా సమస్య వస్తే ముందుగా వసతిగృహ అధికారిణికి తెలియజేయాలన్నారు. ఈవ్‌టీజింగ్ ఎదురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్ అధికారిణి పి.శోభారాణి పాల్గొన్నారు.


ఓబులవారిపల్లె: ఏపీఎండీసీ ఆరోగ్య కేంద్రంలో..

హెడ్ పోస్టాఫీసులో..

పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆ కార్యాలయ పోస్టుమాస్టర్ హబీబుల్లా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళా సిబ్బందితో కేక్ కట్ చేయించారు. అనంతరం మహిళా సిబ్బంది మాట్లాడారు. కార్యక్రమంలో డీపీఎం ఆనంద్, ఇతర ఉద్యోగులు మణిలత, లక్ష్మీనారాయణ, మహేష్, రాము, అనీల్, పోస్టల్ ఏజెంట్ల సంఘం ప్రతినిధులు పీఆర్.దయాల్, యతీశ్వర, వి.అనురాధ పాల్గొన్నారు.

రాజంపేటలో..

రాజంపేట : అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.వై.సుధాకర్ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్యం- సాధికారత, యాంటీ బయోటిక్ మందుల దుర్వినియోగం వాటి దుష్ఫలితాలు అనే అంశంపై సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి అన్నమాచార్య ఫార్మసీ కళాశాల హెచ్ఓడి డా.గిరిరాజశేఖర్, అసోసియేట్ ప్రొఫెసర్ శిరీషా పాల్గొని ప్రసంగించారు. సదస్సుకు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్స్ సుధామ్స్, అధ్యాపకులు, విద్యార్థినీలు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

నందలూరులో ర్యాలీ

నందలూరు లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నందలూరు గ్రామంలోని షాదీఖానాలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్‌క్రైమ్స్ అగైనెస్ట్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. నందలూరు జడ్జి కే.లత మాట్లాడుతూ అన్ని రంగాలలో రాణిస్తున్న మహిళల్లో న్యాయ విజ్ఞానంను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం నాల్సా థీమ్ సాంగ్, ఉమెన్ కమిషన్ వీడియో ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. న్యాయవాది అనుదీప్ మహిళా స్థానం గురించి పాటలు పాడారు. అంతర్జాతీయమహిళ దినోత్సవ ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దారు ఉదయశంకర్‌రాజు, సీఐ పుల్లయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహులు, లోక్ అదాలత్ సభ్యుడు ఆనంద్‌కుమార్, న్యాయవాదులు షేక్, ఏవీ సుబ్రమణ్యం, జి.సుబ్బరామయ్య, నూర్‌అహమ్మద్, కోర్టు సిబ్బంది, ఎంఎల్ఎస్‌సీ సిబ్బంది, పీఎల్‌వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


రాయచోటి అర్బన్: పీడీ ధనలక్ష్మి ఆధ్వర్యంలో...


వీరబల్లి: మహిళలను సన్మానిస్తున్న దృశ్యం


రాజంపేట టౌన్: మాట్లాడుతున్న జడ్జి సరస్వతి

రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం

రైల్వేకోడూరు : విశాఖలో ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం తీసుకువచ్చారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం గ్లోబల్ ఇన్వెస్టర్స్ విజయోత్సవ సభ సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక దిగ్గజాలను ఒక వేదికపైకి చేర్చి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా వారిలో భరోసా నింపిన ఘనత సీఎం జగన్‌కే సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవం మొదలైందన్నారు. ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ చూడని రీతిలో 13.41 లక్షల కోట్లు పెట్టుబడులతో 352 ఒప్పందాలు జరగడం గర్వకారణమన్నారు. చంద్రబాబు హయాంలో 40వేల కంపెనీలు తీసుకువచ్చి 4లక్షల మందికి ఉద్యోగాలిచ్చామని లోకేష్ డప్పు కొడుతున్నారని, అసలు చంద్రబాబు హయాంలో ఈ రాష్ట్రానికి చేసింది శూన్యం అన్నారు. కార్యక్రమంలో కొల్లం గంగిరెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సాయికిషోర్‌రెడ్డి, సుధాకర్‌రాజు, ఉప సర్పంచ్ తోట శివసాయి, సుబ్రమణ్యం, వెంకటరెడ్డి, శ్రీరామ్ వినోద్, మల్లు క్రిష్ణారెడ్డి, ఓబుల్‌రెడ్డి, డమ్ము రఘు, పాపిరెడ్డి, దామర్ల సిద్దయ్య, వినోద్‌ఖన్నా, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల, నాయకులు

‘సంక్షేమం అమలులో సీఎం జగన్‌దే అగ్రస్థానం’

రాయచోటి : చెప్పినవి చెప్పినట్లుగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్ సిపి రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లకు ప్రభుత్వ పథకాల అమలు, వాటితీరుపై వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా పలు కార్యక్రమాలు నిలిచిపోయాయని, ఎన్నికల కోడ్ ముగియనుండటంతో ఈ కార్యక్రమాలు, పథకాలు అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు అమలు తేదీలను ఆయన వివరించారు. ఎన్నికల కోడ్‌తో సంబంధం లేని కారణంగా మార్చి 10వ తేదీ నుంచి మధ్యాహ్న భోజనంతోపాటు రాగిజావ అమలు ప్రారంభం, మార్చి 18న సంపూర్ణ ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకం, జగనన్న విద్యా దీవెన లబ్ధిదారుల ఖాతాలలోకి డీబీటీ పద్ధతిలో నగదు జమ, మార్చి 22వ తేదీ ఉగాది రోజున ఉత్తమ సేవలందించిన వలంటీర్ల పేర్లు ప్రకటన ఉందన్నారు. వీరికి ఏప్రిల్ 10న అవార్డులు, రివార్డులు అందజేస్తామన్నారు. సంక్షేమ పథకాలను వలంటీర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సూచించారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఎంచుకోవాలి

గాలివీడు : విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే ఫైజున్నీసా పేర్కొన్నారు. బుధవారం గాలివీడు టౌన్ రవిచంద్ర పాఠశాలలో వార్షికోత్సవం సంబరాలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో అంతర్గతంగా దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసి ప్రస్తుత పోటీ ప్రపంచంలో సఫలీకృతులయ్యేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దోహదపడాలని హితవుపలికారు. వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతోనే భవిష్యత్తు కలదని విద్యార్థులకు సూచించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రవిచంద్ర పాఠశాల యాజమాన్యం సైజు థామస్, షింటో, ఇమ్మానియల్, గాలివీడు సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, వైఎస్సార్ సిపి మండల మైనార్టీ నాయకులు ఎస్ ఖాదర్ మొహిద్దీన్, ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ కేంద్రంలో హోలీ సంబరాలు

కలికిరి : మండల పరిధిలోని సీఆర్పీఎఫ్ (సీఐఏటీ-3) కేంద్రంలో బుధవారం హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. కేంద్రంలోని అధికారులు, జవాన్‌లు కలిసి రంగులు చల్లుకున్నారు. కులమతాలకతీతంగా సోదరభావానికి ప్రతీకగా హోలీ జరుపుకుంటారని సీఆర్పీఎఫ్ కమాండెంట్ కేసీ నిర్మల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్‌లు ఏకే సింగ్, కదమ్‌సింగ్, నందన్వార్, హనుమాన్ రామ్, అసిస్టెంట్ కమాండెంట్‌లు రవికుమార్, హనుమాన్ రామ్, గిరిధర్(పీఏస్), జవాన్‌లు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


హోలీ సంబరాల్లో సీఆర్పీఎఫ్ అధికారులు, జవాన్‌లు

పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

చిట్వేలి : ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజా సంఘాలు విజ్ఞప్తి చేశారు. బుధవారం పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు ప్రజాసంఘాలతో కలిసి చిట్వేలిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయ సమస్యల కోసం పోరాడుతున్నామన్నారు. విద్యావంతులు, మేధావులు ఆలోచించి ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా శాసనమండలిలో ప్రశ్నించి పోరాడే వారికి ఓటువేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ల మణి, ఓబిలి పెంచలయ్య, సుజాత, నాని, మాదాసు నరసింహ, గోశాలదేవి, శాంతయ్య, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం


గుడిసెలో చెలరేగుతున్న మంటలు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చెర్లోపల్లిలో మంగళవారం రాత్రి 7 గంటలకు షార్ట్‌సర్క్యూట్ కావడంతో పూరిగుడిసె దగ్ధమైందని బుధవారం ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు చెర్లోపల్లిలోని ఉప్పుటూరు లక్ష్మయ్య గుడిసె మంగళవారం షార్ట్‌సర్క్యూట్ జరిగి గుడిసె మొత్తం కాలిపోయింది. మంటలను ఫైర్ సిబ్బంది వచ్చి ఆర్పారు. అదృష్టవశాత్తు గుడిసెలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఇక ఆస్తి నష్టాన్ని ఫైర్ డిపార్ట్‌మెంట్ అంచనా వేయాల్సి ఉంది.

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ

పీలేరు రూరల్ : ప్రయాణికుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్ తిరిగి అప్పగించి కండక్టర్ తన నిజాయితీని చాటుకున్నాడు. చిన్నగొట్టిగల్లుకు చెందిన టీటీడీ ఉద్యోగి ద్వారకనాథ్ బుధవారం ఉదయం తిరుపతి నుంచి చిన్నగొట్టిగావడానికి పీలేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కాడు. సుమారు రూ. 15 వేలు విలువైన సెల్‌ఫోన్ బస్సులో పోగొట్టుకొని వెళ్లాడు. అయితే గమనించి కండక్టర్ రామయ్య సెల్‌ఫోన్‌ను జాగ్రత్తగా తీసుకొచ్చి డీఎం కుమార్‌కు అందించారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ద్వారకనాథ్‌ను గుర్తించి సమాచారం అందించారు. బాధితుడికి సెల్‌ఫోన్ అందజేసిన కండక్టర్ రామయ్యను అభినందించారు.

వైభవంగా ముగిసిన మల్లూరమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో మల్లూరమ్మ


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డి

చిన్నమండెం : మల్లూరమ్మ జాతర శుక్రవారం వైభవంగా ముగిసింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దాతల సహకారంతో ఆలయం వద్ద అన్నదానం నిర్విరామంగా సాగింది. మొక్కుబడులు తీరిన భక్తులు పలువురు చాందినీబండ్లను అమ్మవారి ఆలయం చుట్టూ బాణసంచా పేలుళ్లు, మేళతాళాల మధ్య నృత్యాలు చేసుకుంటూ వైభవంగా తిప్పారు. డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో రాయచోటి రూరల్ సీఐ లింగప్ప ఆదేశానుసారం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మల్లూరమ్మకు ఎమ్మెల్యే పూజలు

మల్లూరమ్మ జాతర సందర్భంగా బుధవారం వారు మల్లూరమ్మకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోటి రూపాయల నిధులతో మల్లూరమ్మ ఆలయ ఖ్యాతిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పలు విందులకు ఎమ్మెల్యే హాజరయ్యారు. కొత్తపల్లెలో నిర్మాణంలో ఆలయ నిర్మాణాన్ని ఎమ్మెల్యే, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి కలిసి పరిశీలించారు. రామాలయ నిర్మాణ పనులు, రూ.44 లక్షలతో చేపట్టిన కల్యాణ మండపం నిర్మాణ పనులు, ఫ్లోరింగ్, బాత్‌రూమ్స్ నిర్మాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

గ్రామాల తరలింపులో జాప్యమెందుకు?

కాలుష్య గ్రామాలను తరలించాలని ఏపీఎండీసీకి విన్నవించిన మూడు గ్రామాల ప్రజలు


ఇన్‌చార్జ్ సీపీఓ బెనర్జీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఓబులవారిపల్లె : కాలుష్య గ్రామాలైన మంగంపేట కాపుపల్లె, దళితవాడ, ఆరుంధతివాడ మూడు గ్రామాల తరలింపునకు ఏపీఎండీసీ ఎందుకు జాప్యం చేస్తోందని బెరైటీస్ ఆధారిత ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.రామసుబ్బారెడ్డి ఏపీఎండీసీ అధికారులను ప్రశ్నించారు. బుధవారం ఏపీఎండీసీ కార్యాలయంలో మూడు గ్రామాలను వెంటనే తరలించి పునరావాసం కల్పించాలని సంఘం నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు ఇన్‌చార్జ్ సీపీఓ బెనర్జీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు సహకారంతో మూడు గ్రామాల తరలింపు ప్రక్రియను వేగవంతం అయ్యేలా ప్రయత్నించినా ఏపీఎండీసీ యాజమాన్యం గ్రామస్తులకు పునరావాసం కల్పించేదుకు జాప్యం చేస్తున్నారని వారికి గ్రామాల తరలింపు ప్రక్రియలో అన్ని విధాల గ్రామస్తులు సహకరం అందిస్తున్నా ఏపీఎండీసీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా యాజమన్యం స్పందించి పునరావాసం కల్పించాలని లేనిపక్షంలో శాంతియుతంగా ఆందోళనను చేపడతామని అన్నారు.

నందలూరులో ఇంటింటా ఎమ్మెల్సీ ప్రచారం

నందలూరు(రాజంపేట) : పట్టభద్రుల ఎమ్మెల్సీ వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బుధవారం నాగిరెడ్డిపల్లె అర్బన్ పరిధిలో ఓటర్లను కలుసుకొని ముఖ్యమంత్రి బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకైనా, పట్టభద్రులకైనా మేలు జరగాలంటే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీలను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, సర్పంచ్ సూర్యనారాయణ, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్‌అమీర్, గొబ్బిళ్ల త్రినాథ్, నడివీధి సుధాకర్, కో-ఆప్షన్‌సభ్యుడు కలీం, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


నాగిరెడ్డిపల్లెలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ మేడా